ప్రజాశక్తి

మంగళవారం 4 జులై 2023 5 అనంతపురం

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

నేడు సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పుట్టపర్తి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మంగళవారం నాడు ఆయన పుట్టపర్తిలో పర్యటించనున్నారు. సత్యసాయి ట్రస్టు ప్రశాంతి నిలయంలో నూతనంగా నిర్మించిన సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. వర్చువల్ విధానం ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ దీనిని ప్రారంభించారు. పుట్టపర్తి నుంచి ఈ కార్యక్రమంలో గవర్నర్ నేరుగా పాల్గొంటారు. ఈ మేరకు ఆయన సోమవారం రాత్రే పుట్టపర్తికి చేరుకున్నారు. గవర్నర్ పుట్టపర్తికి రావడంతో ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. కలెక్టర్ అరుణ్‌బబు, ఎస్‌పి మాధవరెడ్డిలు ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ బసచేసే శాంతి భవన్ సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. గవర్నర్ పర్యటన కోసం ఏర్పాట్లను పకడ్బందీగా చేశామన్నారు. మామిళ్లకుంట క్రాస్ నుంచి శాంతిభవన్ అతిథి గహం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సిఐ ఆనందరావు (ఫైలఫొటో)

వివాదాలు, సంచనాలకు కేంద్ర బిందువు అయిన అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో మరో సంఘటన చోటు చేసుకుంది. నిత్యం రాజకీయ ఘర్షణలు చెలరేగే ఈ ప్రాంతంలో ఓ పోలీసు సర్కిల్ ఉన్నతాధికారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఈయన మృతిపై భిన్నవాదనలు విన్పిస్తున్నాయి. పని ఒత్తిడి అని కుటుంబ సభ్యులు చెబుతుండగా, రాజకీయ వేధింపులే కారణం అని ప్రతిపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. పోలీసు మరణాన్ని కూడా రాజకీయాలకు వాడుకుని చిల్లర రాజకీయాలు చేయడం సరికాదంటూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేర్కొన్నారు. మొత్తం మీద తాడిపత్రి సిఐ ఆనందరావు ఆత్మహత్య వ్యవహారం సోమవారం నాడు తాడిపత్రిలోనే కాకుండా జిల్లాలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. పోలీసులు, కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

సిఐ ఆత్మహత్య

- ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన తాడిపత్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్
- మృతిపై పలు భిన్నవాదనలు
- రాజకీయ వేధింపులన్న జెసి.ప్రభాకర్‌రెడ్డి
- చిల్లర రాజకీయాలు తగదన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి
- కుటుంబ కలహాలే కారణం : ఎస్పీ

ప్రజాశక్తి తాడిపత్రి.

తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఆనందరావు(51) విధులు నిర్వహిస్తున్నారు. 1998లో ఎస్ఐగా పోలీసు శాఖలో విధులు ప్రారంభించిన ఆయన తరువాత సిఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఏడాదిగా తాడిపత్రి సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు వద్ద అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం నాడు యథావిధిగా ఆయన విధులకు హాజరయ్యాడు. విధులు పూర్తయిన తరువాత రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. తనగదికి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆయన గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వేకువజామున 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆనందరావు గదిలో చూడగా ఆయన ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే డీఎస్పీ గంగయ్య పట్టణ ఎస్ఐ ధరణి బాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ మృతి విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసులు ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఆనందరావు సొంతూరైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కల్లోడుపల్లి గ్రామానికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు

అందరితో మంచిగా ఉండే సిఐ ఆనందరావు ఆత్మహత్య విషయం తెలియగానే పోలీసు సిబ్బంది నిర్ఘాంతపోయారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి తదితరులు చేరుకుని నివాళులు అర్పించారు. పోస్టు మార్టం అనంతరం పోలీసు గౌరవ వందనం తెలియజేశారు.

రాజకీయ కారణమా... కుటుంబ కలహాలా..!

సిఐ ఆనందరావు మృతిపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. అధికారిక ఒత్తిళ్ల కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, కుటుంబ కలహాలన్న మరో వాదన వినిపిస్తోంది. భార్యకు ఆయనకు మధ్య కొంతకాలంగా గొడవలున్నట్టు సమాచారం. ఆదివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వాదనలు జరిగినట్టు తెలుస్తోంది. పని ఒత్తిడి వల్లనే తన తండి ఆత్మహత్య చేసుకున్నాడని సిఐ కూతరు మొదట మీడియాకు చెప్పినప్పటికీ తరువాత వ్యక్తిగత కారణాలతోనని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వృత్తిపరమైన ఒత్తిళ్లు లేవు : ఎస్పీ

ఆనందరావు ఆత్మహత్య చేసుకున్న ఇంటిని ఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆనందరావు గత సంవత్సర కాలంగా తాడిపత్రిలో సిఐగా తన విధులను పూర్తి స్థాయిలో నిర్వహించారన్నారు. ఆయనకు ఎలాంటి వత్తిపరమైన ఒత్తిళ్లు లేవన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దర్యాప్తు తరువాత పూర్తి వివరాలు బయటకు వస్తాయని చెప్పారు.

ఒత్తిడి ఉందని చెప్పేవారు

సిఐ కుమార్తె భవ్య

ఇటీవల విధి నిర్వహణలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉందని తరచూ నాన్న చెప్పేవారంటూ సిఐ ఆనందరావు కూతురు భవ్య సోమవారం ఉదయం ఆసుపత్రి వద్ద విలేకరులకు తెలిపారు. గతంలో కడప, తిరుపతి ప్రాంతాల్లో విధులు నిర్వహించిన సమయంలో ఇలా ఎప్పుడు ఒత్తిడికి గురైన సందర్భాలు లేవన్నారు. గత మూడు నెలలుగా తీవ్రంగా ఒత్తిడికి లోను అవుతున్నట్లు తమతో చెప్పేవారని ఆమె తెలియజేశారు.

రాజకీయ ఒత్తిళ్లే కారణం

మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి సిఐ ఆనందరావు ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణం అని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆనందరావు మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ ఒత్తిడి తట్టుకోలేకనే సిఐ ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఓ కేసులో వైసీపీ నాయకుడిని చేర్చాల్సి ఉండగా ఆ నాయకుడిని కేసులో చేర్చరాదంటూ అధికార పార్టీ నాయకులు సిఐపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఇదే విషయమై ఓ ఉన్నతాధికారి ఆఫీసులో వైసీపీ నాయకుడు, పట్టణ సిఐ, ఎస్ఐ ఆదివారం నాడు చర్చలు జరిపింది వాస్తవం కాదా అన్న విషయాలను బహిర్గతం చేయాలన్నారు.

చిల్లర రాజకీయం చేయడం తగదు

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

సిఐ ఆత్మహత్యను కూడా రాజకీయం చేసి, చిల్లర రాజకీయాలు చేయడం తగదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సిఐ ఆత్మహత్యపై జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. సిఐ ఆనందరావు మతి చాలా బాధాకరం అన్నారు. సిఐ మృతిపై జెసి.ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం జెసి బ్రదర్స్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. సిఐ మృతిపై అవసరం అయితే విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉన్నమని ఎమ్మెల్యే తెలిపారు.

సిఐకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీ గోరంట్ల మాధవ్

ఇంట్లో ఆనందరావు మృతదేహం

ప్రణాళికతో ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

కలెక్టర్ ఎమ్.గౌతమి

కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఈనెల 8న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఎమ్.గౌతమి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి పరిశీలించారు. కళ్యాణదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ ఎదురుగా ఉన్న సువిశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదిక సభాస్థలం, ఇతర ఏర్పాట్లపై స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. ధర్మవరం రోడ్డు వైపునున్న సిఎం హెలీప్యాడ్ పనులు, విఐపి, వివిఐపిల సిట్టింగ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వాల్మీకి సర్కిల్ నుంచి బైపాస్ కూడలి వరకు కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో కలిసి కాలినడకన నడుస్తూ ముఖ్యమంత్రి ప్రయాణించే రోడ్డు మార్గాన్ని తనిఖీ చేశారు. హెలీప్యాడ్ నుంచి సభ వేదిక వద్దకు గౌరవ ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి రోడ్డు విస్తరణ, కంపచెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల తొలగింపు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, పారిశుధ్య పనుల నిర్వహణ, పోలీసు భద్రత, బ్యారీకేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ పనులను వేగవంతంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మార్కెట్ యార్డ్ ప్రాంగణానికి చేరుకుని డా॥వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. పూర్తయిన భవన నిర్మాణం పనులు సాంకేతిక పరికరాల ఏర్పాటు తదితర అంశాల గురించి సంబంధిత శాఖ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ నిశాంత్ రెడ్డి, అనంతపురం ఆర్డీవో మధుసూదన్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ సురేంద్ర, డిపిఒ ప్రభాకర్ రావు, డిఎల్‌డిఒ శంకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సరి చేశారు..!

ప్రజాశక్తి ఎఫెక్ట్

- అన్‌సెటిల్డ్ భూముల వ్యవహారంపై అధికారుల్లో కదలిక
- ప్రకంపన సృష్టించిన ప్రజాశక్తి కథనం
- ఆఘమేఘాలపై దిద్దుబాటు చర్యలకు శ్రీకారం
- ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరు తొలగింపు
- రైతులకు మద్దతుగా వ్యకాసం ఆందోళన
- ప్రజాశక్తికి రైతులు, ప్రజల కృతజ్ఞతలు



సోమవారం నాడు లేపాక్షి హబ్ పేరు మారుస్తూ అడంగల్‌లో అన్‌సెటిల్డ్ పేరుపై వచ్చిన జాబితా

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో ఆన్‌సెటిల్డ్ భూములను అండంగల్‌లో లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌కు మారుస్తూ రెవెన్యూ అధికారులు చేసిన నిర్వాకంపై సోమవారం నాడు ప్రజాశక్తి పత్రికలో పక్కాగా ఏ'మార్చేశారు'..! అన్న శీర్షికతో వెలువడిన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ కథనం వెలువడగానే సోమవారం నాడు మండల రెవెన్యూ అధికారుల్లో దడ పుట్టింది. ఉదయం తొమ్మిది గంటలకే అధికారులు కార్యాలయానికి చేరుకుని దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. దీనికి తోడు రైతులు, ప్రజలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వీరికి జనసేన నాయకులూ మద్దతు తెలిపారు. దీంతో ఉక్కిరిబిక్కిరైన అధికారులు ఆన్‌లైన్‌లో పేరు మార్పునకు ఆఘమేఘాల మీద చర్యలు తీసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు తహశీల్దార్ చేరుకుని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల పట్టా భూములను లేపాక్షి హబ్ పేరుపై ఎలా మార్చారో అధికారులు సమాధానం ఇవ్వాలన్నారు. మిగులు భూముల పేరుతో రైతుల పట్టా భూములను లాగేసుకునే కుట్ర జరుగుతోందన్నారు. ఒక వేళ మిగులు భూములు అయినా వాటిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు ఎలా బదలాయిస్తారని ప్రశ్నించారు. లేపాక్షి హబ్‌కు భూములు కట్టబెట్టే కుట్రకు అధికారులు సహకరిస్తుండడం దుర్మార్గమన్నారు. ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూములను యథావిధిగా అలానే ఉంచాలని ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ సాంకేతిక సమస్య వల్లనే ఈ పొరబాటు జరిగిందన్నారు. పొరపాటున అన్‌సెటిల్డ్ భూములన్నీ లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములుగా మారాయన్నారు. కొంత సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు వ్యకాసం నాయకులు, రైతులు ఒప్పుకోలేదు. తాము కార్యాలయంలోనే ఉంటామని, వెంటనే సమస్యను పరిష్కరించక పోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. దీంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు మొత్తం ఈ సమస్య దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. అరగంట సమయంలో లేపాక్షి హబ్ పేరుపై ఉన్న భూములను యథాప్రకారం అన్‌సెటిల్డ్ పేరుపై అడంగల్‌లో మార్చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే కథనాన్ని ప్రచురించిన ప్రజాశక్తికి, తమ పక్షాన పోరాటం సాగించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకులు వెంకటేష్, సిపిఎం నాయకులు లక్ష్మినారాయణ, రామచంద్ర, జనసేన నాయకులు రమణ, చిన్నా, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన వ్యకాసం నాయకులు, రైతులు

కరోనాలో పని చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లికార్జున

రిలే దీక్షలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కరోనా మొదటి, రెండవ దశల్లో ప్రాణాలను సైతం లెక్కజేయకుండా పట్టణ ప్రజలకు సేవలు అందించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కార్మికులతో కలిసి వినాయక కూడలి నుంచి పురపాలక సంఘం వరకూ ర్యాలీ చేరుకున్నారు. అనంతరం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో ప్రజలకు సేవలు అందించడానికి ఎంతో ధైర్యంగా కార్మికులు ముందుకు వచ్చి దాదాపు 11 నెలలపాటు పనులు చేశారన్నారు. వీరు కరోనా సోకి మృత్యువాత పడిన వారిని వారి బంధువులు తీసుకెళ్లకపోయినా వీరే ఖననం చేశారని గుర్తు చేశారు. అప్పుడే కాకుండా గత సంవత్సరం వర్షాకాలంలో కూడా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి పారిశుధ్యం పడకేసినప్పుడు, పట్టణంలో పెద్ద డ్రెయినేజీ కాలువల పూడికతీతలోనూ నెలరోజులపాటు పనిచేశారన్నారు. ఇలాంటి కార్మికులను విధుల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గతేడాది నుండి అధికారులు, పాలకులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పట్టణ జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంపులో భాగంగా కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి దీక్షకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు రాము, మల్లేష్, నగేష్, డేవిడ్, తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయపుత్ర, తిప్పేస్వామి, రాజు, చిన్న నిర్మల, ధర్మేంద్ర, సీనా రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల పట్టాల రద్దు దుర్మార్గం

మాజీ మంత్రి పరిటాల సునీత

నిరసన వ్యక్త చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్.రాజు, బాధితులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి హయాంలో నిరుపేద దళితులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండలం, బి యాలేరులో దళితుల ఇళ్ల పట్టాలు రద్దు చేయడాన్ని నిరసిస్తూ టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్.రాజు నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందసర్భంగా ఆమె మాట్లాడుతూ బి.యాలేరు దళితులకు టిడిపి ప్రభుత్వంలో భూములు కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిందని ఉన్న వారికి ఇళ్ల పట్టాలు రద్దు చేయడం ఏమిటన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామంటే తాము స్వాగతిస్తామన్నారు. ఉన్న పట్టాలు రద్దు చేసి వైసిపి నాయకులకు కావాల్సిన వారి కోసం ఇస్తామంటే సహించేది లేదన్నారు. పేదలను ఆదుకోవాలంటే వేరొకచోట భూములు కొని ఇవ్వాలన్నారు. అలా కాదని దళితుల్లో చీలిక తెచ్చి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఆ స్థలంపై జేసి కోర్టులో ఉన్నప్పటికీ మరొకరికి పట్టాలు ప్రయత్నం చేయడం సరికాదన్నారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్.రాజు మాట్లాడుతూ దళితులంటే ప్రభుత్వానికి ఎందుకంత చులన అన్నారు. ఉన్న ఇళ్ల పట్టాలను రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు రాజకీయం చేస్తారని, అయితే అధికారులు మాత్రం చట్టం అనుసరించి పేదలకు న్యాయం చేసే బాధ్యతను నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా దళితులకు ఇలాంటి చర్యలతో అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్క దళితుని ఇళ్ల పట్టా రద్దు చేసిన పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జెఎసి కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్ఎహెచ్ఎం జెఎసి కార్యాచరణలో భాగంలో జిల్లాలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఎన్ఎహెఎం ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో స్పందనలో కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల యూనియన్ నాయకులు జయ, శ్రీనివాసులు, సత్తి, మణి, ఖాధర్, రషీద్, సుమంత్, తులసి, రామాంజినమ్మ, జ్యోతి, మహమ్మది, ప్రభావతమ్మ, సరిత, జానకి తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రలో భగ్గుమన్న టిడిపి విభేదాలు

తోసుకున్న తెలుగు తమ్ముళ్లు

బాహాబాహీకి దిగుతున్న తెలుగుతమ్ముళ్లు

ప్రజాశక్తి-గుత్తి

గుంతకల్లు నియోజకవర్గంలో కొన్నినెలలుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్రలో భాగంగా సోమవారం గుత్తికి వచ్చిన బస్సుయాత్రలో రెండు వర్గాలకు చెందిన విభేదాలు బహిర్గతమయ్యాయి. స్థానిక పట్టణంలోని గాంధీ కూడలిలోకి నాయకులు ప్రయాణిస్తున్న బస్సు రాగానే టిడిపి స్థానిక నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అయితే టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు వర్గీయులు కొంత సమయం బస్సు యాత్ర గుత్తిలోనే ఉంచాలని కోరారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఇంకా చెరువు కట్ట వద్ద ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించాలని, గుంతకల్లు బహిరంగ సభ ఉందని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ వర్గీయులు చెప్పారు. గుత్తిలో సమయం కేటాయించాలని వెంకటశివుడు వర్గీయులు పట్టుబట్టడంతో రెండువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నాయకులు, కార్యకర్తలు బహాబహీకి దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తెలుగు తమ్ముళ్లు ఒకరినొకరు దూషించుకున్నారు. నాయకులు ఇరువర్గాలకు సర్ది చెప్పారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టాల్సిన టిడిపి నాయకులు, కార్యకర్తలు బస్సు యాత్రలో తోసుకోవడం, దూషించుకోవడం పట్ల పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

మహిళల పోరుయాత్ర కరపత్రాలు విడుదల

పోరుయాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో చోటు చేసుకుంటున్న హింసలు నిర్మూలించాలని, మద్యం, మత్తు పద్రాలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో చేపడుతున్న హింసపై మహిళల పోరు యాత్ర కపత్రాలను ఐద్వా నాయకులు ఆవిష్కరించారు. సోమవారం జెవివి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస వ్యతిరేకిస్తూ జూలై 28వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకూ ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం, రాష్ట్రంలో చిన్న పిల్లలు, మహిళలపై దాడులు, హత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. మహిళా రెజ్లర్‌లపైనే లైంగిక దాడులు జరుగుతుంటే సమాజం ఎంత దుర్మార్గంగా తయారైందో తెలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు, హింసను అరికట్టే వరకూ మనం ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఏదో ఒక ప్రాంతంలో నిమిషానికి అగాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. వెలుగులోకి వస్తున్నవి కొన్ని మాత్రమే అన్నారు. పోరు జాతాలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డాక్టర్ ప్రసూన, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, నాయకులు జయమ్మ, నిర్మల పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

'స్పందన'లో ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం క్రైం : ఉద్యోగాలు ఇప్పిస్తానని తమ నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిందని స్థానిక గణేష్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వరులు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. సుచిత్రా ఏజెన్సీస్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కనకం సరిత మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలో మండల కో-ఆర్డినేటర్ గా ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి రూ.5 లక్షలు వసూలు చేసిందన్నారు. దీంతో పాటు నిరుద్యోగులైన తన మిత్రుల నుంచి కూడా రూ.15 లక్షలు కట్టించానని తెలిపాడు. ఉద్యోగం గురించి అడిగితే అదిగో.. ఇదిగో.. అంటూ నమ్మబలుకుతూ వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడు ఉద్యోగమైనా ఇప్పించాలని లేదా డబ్బులైనా ఇవ్వాలని అడిగితే డబ్బు ఇచ్చేది లేదు ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరింపులకు దిగుతోందని వాపోయాడు. అసలే నిరుద్యోగిగా ఉన్న తనకు తన మిత్రుల నుంచి కట్టించిన సొమ్మును ఎలా తిరిగివ్వాలో అర్థం కావడం లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. సరితపై తగిన చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరాడు.

ఘనంగా భీమలింగేశ్వర స్వామికి బిందెసేవ

ఉరవకొండ : విడపనకల్లు మండలం గడేకల్ గ్రామంలో వెలిసిన వేములవాడ భీమలింగేశ్వర స్వామి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం బిందెసేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి మూలవిరాట్‌ను పల్లకిలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టుకుని భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మఠం పూజారులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ జెడి నాగలింగారెడ్డి

మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నాగలింగారెడ్డి

రాయదుర్గం రూరల్ : కెజిబివి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల శాతం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ, కడప ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ నాగలింగారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని కెజిబివి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఇందులో భాగంగా కళాశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అంతర్గత మార్కులు వేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అయితే ప్రతిభ ఉన్న విద్యార్థులను ఆ విధంగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రఘురామమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుగూడులో తలనీలాలకు 6న వేలంపాట

నార్పల : గుగూడు కుల్లాయిస్వామి ఆలయంలో భక్తులు స్వామికి సమర్పించే తలనీలాలు పోగు చేసుకోవడానికి ఈనెల 6న ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ, కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 19 నుంచి వచ్చే ఏడాది మొహర్రం వేడుకల వరకూ తలనీలాలు సేకరించే హక్కు ఉంటుందని తెలిపారు వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు రూ.5 లక్షల ధరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం పదిలం : ఎంపిపి

యోగా చేస్తున్న మహిళలు

బుక్కరాయసముద్రం : యొగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపిపి సునీత అన్నారు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ప్రతి మనిషికీ ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయాన్ని కేటాయించి యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఉమా శర్మ, యోగా గురువు నరేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Addl. Senior Civil Judge: Ananthapuramu
I.P.No.38/2021
Between:
K.Mamatha ...Petitioner
V/s
1.R.Sheetal 2.Y.Sarasathi ...Respondants
NOTICE TO RESPONDANT NO.1
To,
R.Sheetal W/o R.Umesh Kumar, Flat No.105, Aadarana Apartment, Sai Nagar, Ananthapuramu Dist.
పైన కనబరచిన ఐ.పి.లో 1వ ప్రతివాది హాజరు నిమిత్తము 06-07-2023వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తేదీన నీవు కానీ, నీ తరుపున వకీలు గానీ హాజరై ఏమైన ఆక్షేపణలున్నచో తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా:06-07-2023
ఉదయం 10.30 గం॥లకు
అల్లు నారాయణప్ప, అడ్వకేట్
అనంతపురం, సెల్: 9908616177.

In the Court of the 1st Addl. Jr. Civil Judge: Ananthapuramu
O.S.No.765/2022
Between:
Nallaballa Sivaiah & 4 ors. ...Plaintiffs
V/s
1.P.Lakshmidevi 2.M.Prakash ...Defendants
NOTICE TO DEFENDANT NO.2
To,
M.Prakash S/o M.Bala Veeranarappa, MIG II-70, APHB Colony, Ananthapuramu Dist.
పై దావాలో 2వ ప్రతివాది హాజరు నిమిత్తము 11-07-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు నీవు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలున్నచో తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున తీర్మానము చేయబడును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా:11-07-2023
ఉదయం 10.30 గం॥లకు
అల్లు నారాయణప్ప, అడ్వకేట్
అనంతపురం, సెల్: 9908616177.

మహారాజశ్రీ జిల్లా జడ్జిగారి కోర్టు:అనంతపురం
ట్రాన్స్‌ఫర్ ఓ.పి.నెంబర్ 01/2023
Between:
1.గుత్తా వెంకటనారాయణ 2.గుత్తా సావిత్రమ్మ ...పిటీషనర్లు
V/s
1.చిలమకూరి రామన్న
2.చిలమకూరి జలజాక్షి
3.చిలమకూరిరాఘవ అలియాస్ రాఘవేంద్ర
4.చిలమకూరి మీనాక్షి అలియాస్ మీనాక్షమ్మ ...ప్రతివాదులు
పేపర్ ప్రకటన
పై కేసు నందు ప్రతివాదులైన 3వ ప్రతివాది మరియు 4వ ప్రతివాది అయిన మీరు ఇరువురు జిల్లా కోర్ట్ నుంచి నోటీస్‌లు పంపుచున్న తమరు కోర్టు వారి ఎదుట హాజరు కావడం లేదు. కావున కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై కేసును పై కోర్ట్ నందు తదుపరి వాయిదా 18-07-2023 గా వాయిదా మీ హాజరు నిమిత్తం వేసినది. కావున పై కేసులోని ప్రతివాదులైన 3 ప్రతివాది i.e., (చిలమకూరి రాఘవ అలియాస్ రాఘవేంద్ర తండ్రి లేట్ సి.రామన్న తగ్గుపర్తి విలేజ్ బెళుగుప్ప మండలం, అనంతపురము జిల్లా), మరియు 4వ ప్రతివాది i.e., (చిలమకూరి మీనాక్షి అలియాస్ మీనాక్షమ్మ తండ్రి లేట్ సి.రామన్న, తగ్గుపర్తి విలేజ్, బెళుగుప్ప మండలం, అనపంతురం జిల్లా) మీరు గౌరవనీయులైన పై కోర్టు నందు పై వాయిదా అయిన 18-07-2023 తేదీ నాడు మీరు స్వయంగా గానీ లేదా మీ చేత నియమింపబడిన వకీలు ద్వారా గానీ మీరు హాజరై పై కేసు నందు గల విషయాలపై మీరు మీ ఆక్షేపణలు, పై కోర్టు వారికి తెలుపుకోగలరు. పై తేదీనాడు మీరు గైరుహాజరైతే కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానం చేయగలరు.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ ప్రకటన)
ఎస్.సుబ్రమణ్యం, వకీలు
అనంతపురం, సెల్:9440017703.

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

గుత్తి : పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జక్కలచెరువు గ్రామంలో సర్పంచి సుహాసిని, మాజీ ఎంపీటీసీ రాజన్న ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సునీలా యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకటరాముడు, వై.సుభాష్‌రెడ్డి, బి.రాజ్‌కుమార్‌రెడ్డి, గురుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎస్.రాముయాదవ్, ఎన్‌సి.రంగయ్య, పుల్లారెడ్డి, భరత్‌రెడ్డి, ఎంపిటిసి చిన్న వీరన్నగౌడ్, కౌన్సిలర్లు ఫారుక్, వాల్మీకి శివ, వరద పాల్గొన్నారు.

ఇండియా ఉమెన్ క్రికెట్ జట్టుకు జిల్లా క్రీడాకారిణి

ఇంటియా జట్టుకు ఎంపికైన అనూషను అభినందిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి బి.అనూషా సీనియర్ భారత మహిళా జట్టుకు ఎంపికైనట్లు జిల్లా టికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మధు ఆచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన అనూషా జులై 9 నుంచి 22వ తేదీ వరకు జరిగే బంగ్లాదేశ్ పర్యటనలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈమె ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన ఆసియా కప్‌లో వర్ధమాన భారతదేశానికి ప్రాతినిథ్యం వహించినట్లు తెలిపారు. అక్కడ అనూషా ఫీల్డింగ్, ఫిట్‌నెస్, బౌలింగ్‌లో ఆకట్టుకోవడంతో కోచ్‌లు, సెలెక్టర్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుండి సీనియర్ ఇండియన్ ఉమెన్ టీమ్‌కి ఎంపిక చేసినట్లు తెలిపారు. అనూషా 2014 నుంచి ఇప్పటి వరకు ఆర్‌డిటి క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. దేశ క్రికెట్‌కు ఎంపికైన అనూషాను ఎడిసిఎ ప్రెసిడెంట్ పిఎల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్‌డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఆర్‌డిటి మహిళా సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్, అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు, ఆర్‌డిటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సాయినగర్ 3వ క్రాస్, వినాయక్ నగర్, రుద్రంపేట సచివాలయం-3 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే అనంతపురం నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పలు సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడంతోపాటు 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇన్నాళ్లు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు బాగా పని చేశారని, అదేస్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు పథకాలు అందిస్తున్నామన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ఏదైనా సమస్య వస్తే తప్పించుకునే పరిస్థితి గతంలో ఉండేదని, కానీ ఇప్పుడు జల్లెడ పట్టి మరీ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ మంజుల, జేసీఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు బాలాంజినేయులు, నాగమణి, సుమతి, సర్పంచి పద్మావతి, ఎంపిటిసిలు మహబూబి, నారాయణమ్మ, కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది సంగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సహకార ఉద్యోగ సంఘాల జెఎసి, సిఐటియు నాయకులు

వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, సహకార ఉద్యోగ సంఘాల జేఏసి అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పిఎసియస్‌లలో రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలన్నారు. కానీ పిఎసిఎస్‌లలో 50 శాతం వాటాలను ప్రయివేట్ వ్యక్తులకు కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలన్నారు. ఇప్పటి వరకు రైతుల భాగస్వామ్యంతో నిర్వహించబే సహకార సంఘాలు ప్రయివేట్ వ్యక్తులు, కంపెనీల ఆధిపత్యంలోనికి వెళ్లకూడదన్నారు. రైతులు మాత్రమే సంఘాలలో యజమానులుగా ఉండాలన్నారు. 36 జిఒ, 90 జిఒ ప్రకారం వేతనాలను అమలు చేయాలన్నారు. 1, ఏప్రిల్ 2016 నుంచి మోనటరీ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యూటీని గ్రాడ్యూటీ చట్ట ప్రకారం అమలు పరచాలన్నారు. రాష్ట్ర సహకార బ్యాంక్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు ఉద్యోగుల జీతాలను ఆడిట్ నందు డ్యూటూలో పెడుతున్నారని, ఈ డ్యూటూలను రద్దు చేయాలన్నారు. అనంతరం స్పందనలో జడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, రీజనల్ సెక్రటరీ హనుమంతరెడ్డి, ట్రెజరర్ దామోదర్ హరిక్రిష్ణ, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన : మాజీమంత్రి పల్లె

సెల్ఫీ దిగుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో అసమర్థత పాలన కొనసాగుతోందని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య యాత్ర సోమవారం గుత్తికి చేరుకుంది. స్థానిక పట్టణ శివారులోని గుత్తి అనంతపురం రోడ్డులో మిడ్ పెన్నార్ తాగునీటి ప్రాజెక్టు సంబంధించిన 11 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులను టిడిపి నేతలు పరిశీలించారు. అక్కడ చాలెంజ్ సెల్ఫీ తీసుకున్నారు. ఈసందర్భంగా పల్లె మాట్లాడుతూ గుత్తి మున్సిపాలిటీలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం కోట్ల నిధులతో మిడ్‌పెన్నార్ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లు గడిచిన మిడ్ పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. చేతగాని ప్రభుత్వంతో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీమంత్రి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్, కళ్యాణదుర్గం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవానీ

పారిశుధ్య పరికరాలను పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ నంగినేని భవానీ

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవానీ తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.6.50లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పారిశుధ్య పనులకు అవసరమైన పరికరాలను సచివాలయ శానిటరీ కార్యదర్శులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజారోగ్యాన్ని ఇబ్బందులు లేకుండా పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలను రూ.6.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 35 సచివాలయాలకు 50 చెత్త సేకరణ తోపుడు బండ్లు, 16 పవర్ స్ప్రేయర్ మిషన్లు, 3 ఫాగింగ్ మిషన్లు, కార్మికులకు అవసరమైన రేడియం స్టిక్కర్లు ఉన్న జాకెట్లు, చేతులకు గ్లౌసులు అందజేశామన్నారు. అలాగే దోమల నివారణకు చర్యలు తీసుకునేందుకు ఫ్యాగింగ్ మిషన్లు, పవర్ స్ప్రేయర్లు కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వి.మల్లికార్జున, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, సచివాలయాల శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటా సాహితీ పురస్కారం అందుకున్న అప్పిరెడ్డి హరినాథరెడ్డి

నాటా సాహితీ పురస్కారం అందుకుంటున్న అప్పిరెడ్డి హరినాథరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అమెరికాలోని డల్లాస్ నగరంలో నిర్వహించిన నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) మహాసభల్లో జిల్లావాసి, సాహిత్య, సామాజిక రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి నాటా విశిష్ట సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి చేస్తున్న సాహిత్య కృషిని వివరించారు. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ ప్రాంత సాంస్కృతిక వికాసానికి చేస్తున్న ప్రయత్నానికి అభినందించారు. సీమ జనజీవితం నీళ్లతో ముడిపడి ఉందన్నారు. అందరూ నీళ్ల సాధనకు సిద్ధం కావాలన్నారు. రాయలసీమలో ప్రజాఉద్యమాలు, సాంస్కృతిక వికాసం, అభివృద్ధికి ప్రవాస సీమవాసులు మద్దతుగా నిలవాలని కోరారు.

హామీలు అమలు చేసి కళ్యాణదుర్గానికి రావాలి

కళ్యాణదుర్గం : గతంలో ఇచ్చిన హామీ మేరకు కళ్యాణదుర్గం ప్రాంతంలో 114 చెరువులకు నీరందించి తర్వాతనే ముఖ్యమంత్రి జగన్ పర్యటనకు రావాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి సూచించారు. సోమవారం స్థానిక ఉన్నం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'జగన్ చెప్పాడటే చేస్తాండంతే' అన్న నినాదంతో ఓట్లు వేయించుకుని ప్రజలను నట్టేట ముంచారన్నారు. కళ్యాణదుర్గం ప్రాంత చెరువులకు నీరు వస్తున్నాయి, రైతులకు పరిహారం అందబోతోందని ఆర్భాటంగా ర్యాలీ చేపట్టిన మంత్రి ఉషశ్రీచరణ్ కాలువల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తులేకపోవడం బాధాకరమన్నారు. జులై 8న రైతుల దినోత్సవంగా చెప్పుకోవడం తప్ప రైతులకు ఒరగబెట్టింది ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయల శ్రీనివాసులు, కొల్లాపురప్ప, గౌని శ్రీనివాసులు, లింగన్న, నారాయణ, గడ్డం రామాంజినేయులు, పాలబండ్ల రామన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

పుట్లూరు : మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31వతేదీ వరకూ మండలంలో వివిధ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలవ్యాప్తంగా రూ.13.26 కోట్లకు సంబంధించి ఆడిట్ చేశారు. ఇందులో రూ.1,29,844 అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, డిఇఒ రమణారెడ్డి, ఎపిడి వెంకటరత్నం, శివారెడ్డి, ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్‌ఎలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి

బ్రహ్మసముద్రం : మండలంలో హంద్రీనీవా కాలువల తవ్వకానికి భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని టిడిపి యువనేత ఉన్నం మారుతీచౌదరి డిమాండ్‌చేశారు. సోమవారం మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో మాజీ సర్పంచి సత్యనారాయణ స్వగృహంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్ కోసం భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారాన్ని చెల్లించిన తర్వాతే సీఎం జగన్ కళ్యాణదుర్గంలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. తన నాన్న జన్మదినాన్ని రైతు దినోత్సవంగా జరుపుతున్న సిఎం జగన్ కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు నీళు అందించే బృహత్తర కార్యక్రమానికి భూములు ఇచ్చిన రైతన్నలకు తక్షణమే డబ్బులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేదంటే భూములు కోల్పోయిన రైతులతో సిఎం సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వన్నురుస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు చెన్నమల్ల, మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ శేఖర్, వార్డ్ మెంబర్ అంజి, మండల ఎస్సీ సెల్ నాయకుడు దుర్గేష్, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మొబైల్ క్యాంటీన్ వాహనం దగ్ధం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాడిపత్రి రూరల్ : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి మొబైల్ క్యాంటీన్ వాహనం దగ్ధమైన ఘటన రూరల్ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న ఐశ్వర్య విల్లాస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నాగేంద్ర రూరల్ పరిధిలోని కడప రోడ్డులో ఓ వ్యాన్‌లో క్యాంటీన్ నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే సోమవారం యథావిధిగా క్యాంటీన్‌లో గ్యాస్ స్టవ్‌ను వెలిగించేందుకు ప్రయత్నించగా గ్యాస్ లీక్ అయ్యి మంటలు చెలరేగాయి. దీంతో వాహనం మొత్తం మంటల్లో కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వ్యానుకు అంటుకున్న నిప్పును ఆర్పివేశారు. గాయపడిన నాగేంద్రను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : ఆత్మకూరు మండలం వడ్డిపల్లి గ్రామంలో కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వడ్డిపల్లి గ్రామానికి చెందిన కేశవ హోటల్ పై దాడి చేసి 192 కర్నాటక టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేశవను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ మునిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

నార్పల : మండల కేంద్రంలోని 4వ సచివాలయంతోపాటు దుగుమర్రి సచివాలయంలో సోమవారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, తహశీల్దార్ సురేష్ మాట్లాడుతూ రేపటి నుంచి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. అంతేగాకుండా దాదాపు 11 సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, మల్లికార్జున, విఆర్‌ఒలు లక్ష్మన్న, నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బాబు, ఉషారాణి, సచివాలయ సిబ్బంది సాయి శారద, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి 'కాఫీ విత్ వెల్ఫేర్ అసిస్టెంట్' : డిఇఒ

అనంతపురం సిటీ : ఇక నుంచి 'కాఫీ విత్ వెల్ఫేర్ అసిస్టెంట్' కార్యక్రమం చేపట్టనున్నట్లు డిఇఒ సాయిరాం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డిఇఒ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత వెల్ఫేర్ అసిస్టెంట్ల పాత్ర కీలకంగా మారిందన్నారు. కావున వారితో కాఫీ విత్ వెల్ఫేర్ పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పాఠశాలలకు వెళ్లి ప్రభుత్వ విద్యాశాఖలో అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకం, బడి బయటి పిల్లల నమోదు వంటి విషయాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు.

సిఎం సభను విజయవంతం చేయండి

కుందుర్పి : ఈనెల 8న ఏర్పాటు చేయనున్న ముఖ్యమంత్రి జగన్ సభను భారీగా విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో వైసిపి నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సభకు మండలం నుంచి వేలాదిమంది ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, సర్పంచి మారుతీశ్వర రామ్మూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మురికికాలువ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం : పట్టణంలోని మొలకల్‌మూరు రోడ్డు వద్ద ప్రధాన రహదారి పక్కన మురికి కాలువ నిర్మాణానికి విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. రూ.1.70 కోట్లతో మురికి కాలువ నిర్మాణం చేపడుతున్నట్లు విప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మున్సిపల్ వార్డు సభ్యులు శారద, గోవిందరాజులు, పెద్దవన్నూరప్ప, ఫక్రుద్దీన్, డిష్ గోవిందా, సంజీవ మంజునాథ్, షబ్బీర్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, సచివాలయ కార్యదర్శులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

అనంతపురం : నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను రిటైర్డ్ ఇన్ కమ్ టాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, సాహితీ గగన్‌మహల్ సంస్థ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది జె.ప్రతాపరెడ్డి, వసతి గృహాల డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సోమవారం ప్రారంభించారు. వసతి గృహంలో ఉన్న తాగునీటి సమస్యను విద్యార్థులు సాహితీ గగన్‌మహల్ సంస్థ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన అభయ ఫౌండేషన్ ఫౌండర్ హైదరాబాద్ వారికి సమస్యను చెప్పడంతో వారు 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంక్షేమాధికారిణి రంగమ్మ, అసోసియేషన్ ప్రెసిడెంట్ మారుతీప్రసాద్, వసతి గృహ సంక్షేమ అధికారిణి రాజేశ్వరి, సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంటల బీమా ఉత్తదే..!

అనంతపురం కలెక్టరేట్ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత పంటల బీమా అంతా ఉత్తిత్తిదేనని టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో పంటలు నష్టపోయిన రైతులకు ఉచిత పంటల బీమా ద్వారా ఆదుకుంటామని చెప్పిన సిఎం జగన్ నేడు ప్రకటించిన బీమా మొత్తాన్ని చూస్తే రైతులను ఎంతగా మోసం చేశారో అర్థం అవుతుందన్నారు. కరువు జిల్లా అనంతలో అధిక శాతం వేరుశనగ పంట వేయడం, ఆ పంటకు పంటల బీమా పరిహారం అందించకుండా అన్యాయం చేశారని వాపోయారు. కొన్ని పంటలకు అసలు బీమానే ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రతి పంటకూ ఉచిత పంటల బీమా పరిహారం అందుతుందని ప్రగల్బాలు పలికిన జగన్ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రంలో పండించిన ప్రతి పంటకూ ఉచిత పంటల బీమా ద్వారా పరిహారాన్ని అందివ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మురుగుకాలువ నిర్మాణ పనులు పరిశీలన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్డులో నూతనంగా నిర్మించిన సిసి రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మాణం కోసం రూ.2.40 లక్షల నిధులు మంజూరుకాగా కాలువ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇలు సాయినాథ్‌బాబు, రవికుమార్, వైసిపి పట్టణ బూత్ కన్వీనర్ ఎం.రంగస్వామి, నాయకులు అంగడి బాషా, షఫీ తదితరులు పాల్గొన్నారు.